క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి హుండీ ఆదాయం లెక్కించారు. 8 నెలలకు గాను భక్తులు రూ.5,77,376 కానుకల రూపంలో సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకరరెడ్డి, ఈఓలు ప్రసాదరావు, జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకరరెడ్డి, సభ్యులు చలపతి, చాడా రామకృష్ణారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు శాంతిర్యాలీ

బద్వేలు అర్బన్ : మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను వ్యతిరేకిస్తూ బద్వేలు తాలూకా శాంతికమిటీ ఆధ్వర్యంలో గురువారం శాంతిర్యాలీ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక సీఎస్‌ఐ చర్చిలో సమావేశమైన వారు మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శాంతిర్యాలీ సిద్ధవటం రోడ్డులోని సీఎస్‌ఐ చర్చి నుంచి ప్రారంభమవుతుందన్నారు.

7న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రొద్దుటూరు : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 7న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గంటి వేణుగోపాల్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కరుణామణి, లలిత కోరారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

ఆర్థిక సాయం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నరసన్నపల్లె ఎస్సీకాలనీకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త మున్నెల్లి మార్తమ్మ(50) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి మృతిరాలి అంత్యక్రియలకు రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని మేదరవీధిలో పక్కీరయ్యకు చెందిన తాళం వేసిన ఇంట్లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఫ్రిజ్‌లో నుంచి మంటలు వ్యాపించాయి. ఇంట్లో నుంచి పొగ రావడంతో టిఫిన్ నిర్వాహకుడు సుబ్బరాయుడు స్థానికులతో కలిసి ఇంటి తాళాలను పగులకొట్టి కిటికీలు తెరిచారు. తర్వాత నీళ్లతో మంటలను ఆర్పారు. అగ్నిప్రమాదంలో ఫ్రిజ్‌తో పాటు వస్తువులన్నీ కాలిపోయాయి. అగ్నిమాపక అధికారులు మంటలను ఆర్పివేశారు.

అంబేడ్కర్ యూత్ క్లబ్ సభ్యులకు సర్టిఫికెట్లు

పోరుమామిళ్ల : కవలకుంట్ల, కొత్రపాటిపల్లె పంచాయతీల్లో ఏర్పాటు చేసుకున్న అంబేడ్కర్ యూత్ క్లబ్ సభ్యులకు బుధవారం స్టెప్ సూపర్‌వైజర్ నారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. దీనివల్ల ప్రభుత్వ, స్టెప్ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు వారికి అవకాశం కలిగింది. సచివాలయాల కన్వీనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ

మైదుకూరు : మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మైదుకూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆరోగ్యం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. పుట్టిన బిడ్డ నుంచి పుట్టబోయే బిడ్డ వరకు, తల్లి బిడ్డల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. పిల్లలు తక్కువ బరువుతో బలహీనంగా పుట్టడం, అనారోగ్యంతో పుట్టడం జరుగుతుందన్నారు. అలా జరగకూడదనే ఉద్దేశంతోనే సీఎం జగన్ గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకునేవారని తెలిపారు. చాలా మంది అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టేక్ హోం రేషన్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ థామస్, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, చాపాడు మండల ఎంపీపీ టి.లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, మైదుకూరు, చాపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, రమాదేవి, వరలక్ష్మి, నజీర, రాజ్యలక్ష్మి, ప్రశాంతి, ఆరతి, సుబ్బరత్నాలు, జహారాబీ పాల్గొన్నారు.



వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

తల్లిపాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : తల్లిపాలు చిన్నారులకు ప్రకృతి ఇచ్చిన అపురూపమైన వరమని, ఈ పాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డిలు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆంజనేయనగర్ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించడంతో పాటు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి తొలినాళ్లలో ఇచ్చే ముర్రుపాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు సాంబశివారెడ్డి, గుబ్బా వెంకటసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సి.హెచ్.అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు విజయకుమారి, రామలక్షుమ్మ, హసీనా, ఏఎన్‌ఎంలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పూలబావివీధిలో..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పూలబావి వీధి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ పరిశీలకులు బంగారు శీనయ్యలు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సీతారామాపురంలో సర్పంచ్ స్వాతి, అనంతపురం, నక్కలదిన్నె, ఓబాయపల్లెలో సర్పంచ్ అంజనమ్మ, ఎంపీటీసీ పార్వతి, లక్ష్మీపేట, కేతవరం, ఓబుళరెడ్డిపేటలో సర్పంచ్ శ్రీవిద్య, పెద్దగురువకూరు, శ్రీరాములపేటలో సర్పంచ్‌లు రాజేష్‌రెడ్డి, అల్లాడుపల్లెలో కిషోర్‌కుమార్‌రెడ్డి, ఖాదర్‌పల్లెలో సర్పంచ్ షమీమ్ భాను గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు.

గర్భిణులకు వైఎస్సార్ టేక్ హోం రేషన్ పంపిణీ

బ్రహ్మంగారిమఠం : గర్భిణులకు వైఎస్సార్ పోషణ రేషన్ కిట్లను బుధవారం మండలంలోని మల్లేపల్లెలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పోషణ కిట్లను పంపిణీ చేయనున్నట్లు సూపర్‌వైజర్ శారదా దేవి తెలిపారు. కిట్ల పంపిణీ అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి పోషక విలువలతో కూడిన రేషన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చీలం లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ కొండారెడ్డి, అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ఎంపీపీ స్కూల్‌లో బుధవారం గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తల ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కానగూడూరు గ్రామంలో సర్పంచ్ కోట్ల బీబీ గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించారు.

బిడ్డకు తల్లిపాలు తాగించాలి

ప్రొద్దుటూరు క్రైం : బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలని కామనూరు డాక్టర్ ఎస్ శ్రీనివాసులు అన్నారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆంజనేయనగర్‌లో గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

గర్భిణులకు నాణ్యమైన పోషకాహారం

గోపవరం : అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నాణ్యమైన పోషకాహారం అందిస్తుందని మాజీ ఎంపీపీ, గోపవరం ఎంపీటీసీ గోపవరం సరస్వతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురం అంగన్వాడీ కేంద్రంలో నేరుగా గర్భిణులు, బాలింతల ఇంటికే పోషకాహార కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

కలసపాడు : మండలంలోని ముద్దంవారిపల్లెలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను 30 మంది గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ అంకన గోవిందమ్మ, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు లక్ష్మిదేవి, హరిప్రియ, చంద్రకళ, రత్నకుమారి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బద్వేలు అర్బన్ : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బెస్తవీధిలోని సత్యమ్మ ఆలయం ఆవరణలో ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంజూరైన (ఫిష్ వెండింగ్ వెహికల్) త్రీవీలర్ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీపై నిరుద్యోగ యువతకు ఫిష్ వెండింగ్ వాహనాలను అందిస్తాయన్నారు. ఏదైనా కారణాల వలన చేపల ఎగుమతులు తగ్గినప్పుడు మత్స్యకారులు నష్టపోకుండా ఉండేందుకు ఈ ఫిష్ వెండింగ్ వాహనాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ వాహనంలో 200 కిలోల మత్స్య ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చని, అలాగే 20 లీటర్ల సామర్థ్యం గల రెండు ఐస్‌బాక్స్‌లు, వేయింగ్ మిషన్, మైక్ సౌకర్యంతో పాటు మత్స్య ఉత్పత్తులను డ్రెస్సింగ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉప సంచాలకులు కె.ఎస్.వి.నాగలింగాచారి, ఎఫ్‌డీఓ టి.మద్దిలేటి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మిరపల్లె వెంకటరమణ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, వార్డు కౌన్సిలర్ గానుగపెంట సమత, కో ఆప్షన్ మెంబర్ హసన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మత్స్య సహకార సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు నాగేంద్రరావు, సెక్రటరీ వెంకటయ్య, గౌరవ సలహాదారుడు వజ్రాల వెంకటస్వామి, డైరెక్టర్లు చంద్ర, శివశంకర్, సుబ్బన్న, పెంచలయ్య పాల్గొన్నారు.



ఫిష్ వెండింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

పథకాలతో ప్రజల ఆర్థికాభివృద్ధి

కలసపాడు : సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిడుగుపల్లె సచివాలయ పరిధిలోని చెన్నారెడ్డిపల్లె, ముద్దంవారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు అంకన గోవిందమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

రూ.3కోట్లతో కేసీ ఉప కాలువల నిర్మాణాలు

చాపాడు : మండల వ్యాప్తంగా రూ.3కోట్ల వ్యయంతో కేసీ ఉప కాలువల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే పలు గ్రామాలలో పనులు పూర్తవగా మిగిలిన చోట్ల పనులు మమ్మురంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీరాములపేట గ్రామంలో రూ.8.80 లక్షలతో కేసీ కెనాల్‌కు ఉప కాలువ నిర్మాణం చేపట్టారు. ఇటీవల గ్రామంలో నుంచి వెళ్లే పంట కాలువ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో గ్రామ ప్రజలు పలు రకాలైన ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సహకారంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి గ్రామం పొడవునా ఉన్న కేసీ పంట కాలువలో సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ నిర్మించారు. దీంతో పాటు మండలంలోని అనంతపురం, రాజువారిపేట, పల్లవోలు, చియ్యపాడు, అన్నవరం, ఓబుళరెడ్డిపేట ఇంకా పలు గ్రామాల వద్ద కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. పనులను కేసీ కెనాల్ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు ఏఈ జాన్సన్ తెలిపారు.



శ్రీరాములపేట గ్రామంలో పూర్తయిన కేసీ ఉప కాలువ

మైదుకూరు రూరల్ సీఐగా శ్రీనాథ్ రెడ్డి



మైదుకూరు : మైదుకూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనాథ్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు ఏసీబీ నుంచి ఈయన మైదుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో శ్రీనాథ్ రెడ్డి మైదుకూరు రూరల్ సీఐగా కొంత కాలం పనిచేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఖాజీపేట : అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఖాజీపేట మేజర్ పంచాయతీలో నిర్వహించారు. నందిపాడు కాలనీ, పేరారెడ్డికొట్టాలు, నందిపాడు, ఇంజనీరింగ్‌కొట్టాలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలపై అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నియోజక వర్గ కన్వీనర్ శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, సర్పంచ్ రాణెమ్మ, వైస్ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తియ్యదనాన్ని పిల్లలకు రుచి చూపాలి

గోపవరం : చిరుప్రాయంలోనే పిల్లలకు మాతృభాష తెలుగు తియ్యదనాన్ని రుచి చూపించాలని ఏపీ తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంటహనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో జాతీయ జెండా రూపకర్త పింగళివెంకయ్య జయంతి సందర్భంగా తెలుగు భాష తీపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు.

మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి

బద్వేలు అర్బన్ : మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన మహిళల పోరుయాత్ర బుధవారం బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యురాలు మేడా గౌతమి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అనంతమ్మ, రత్నమ్మ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, మహిళా కన్వీనర్ గురుదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐ సెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు

పోరుమామిళ్ల : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐ సెట్–2023 రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షలో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థులు అక్షిత, చెన్ను ప్రసాద్, లోకేష్, రామచంద్ర, కార్తీక్‌లు జిల్లా స్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ తెలిపారు. బుధవారం కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అభినంద కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, అధ్యాపకులు ఈశ్వరయ్య, రవిచంద్ర, వెంకటరావు, పీరయ్య, నరసింహారెడ్డి పాల్గొన్నారు.